
www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



తెలంగాణ దిక్సూచి

శుక్రవారం | 06 | నవంబర్ | 2026 | పేజీలు: 08

అసౌకర్యం కల్గించొద్దు

డబుల్ ఇళ్ళకు పూలే కాలనీగా పేరు

నేడు మంత్రులచే 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే బిఎల్ఆర్ సమీక్ష



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి: మిర్యాలగూడ మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం సమీపంలో నూతనంగా నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శుక్రవారం రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ..మిగతా 2లో

ప్రతి బిడ్డ జీవితం అమూల్యమైనది

పిల్లలను అనాథలుగా వదిలేయకండి

మీకు మేమున్నాం ప్రతి బిడ్డ బాధ్యత ప్రభుత్వానిదే!

పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లకూడదు

కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, అక్షిత బ్యూరో : పిల్లల సంరక్షణపై కలెక్టర్ గురువారం ఒక ప్రకటన మాట్లాడారు సమాజంలోని ప్రతి ఒక్కరికీ, తల్లిదండ్రులకు మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా సూచన చేశారు. మెదక్ జిల్లాలో అనాథగా లేదా అవాంఛితంగా మారిన శిశువులను నడిరోడ్డుపై, చెత్తకుప్పల్లో లేదా నిర్మానుష్య ప్రాంతాల్లో వదిలివేయకుండా, ప్రభుత్వ రక్షణ కేంద్రాలకు అప్పగించాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, సామాజిక ఒత్తిళ్లు, వివాహేతర సంబంధాల కారణంగా పుట్టిన పిల్లలు ..మిగతా 2లో



నాణ్యతలో రాజీ పడొద్దు

పెండింగ్ పనుల్లో వేగం పెంచాలి

నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

చివరి దశ పనులన్నీ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణ పేట అక్షిత బ్యూరో: నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ భవన సముదాయంలోని వివిధ విభాగాలు, ఛాంబర్లు, సమావేశ మందిరాలు, ఇతర మౌలిక సదుపాయాల పనులను నిశితంగా తనిఖీ చేసి, నిర్మాణ ..మిగతా 2లో

పకడ్బందీగా రైతు మేళా

సీఎం రేవంత్ రెడ్డి రాక

సమస్యలు తలెత్తొద్దు: కలెక్టర్ దీపక్ తివారీ



వికారాబాద్,అక్షిత బ్యూరో : రైతు మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ లో గురువారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ నవంబర్ 7 నుండి 9 వరకు నిర్వహించే రైతు మేళా ఏర్పాట్లను అధికారులతో ..మిగతా 2లో

తాగునీటి సమస్యలు తలెత్తొద్దు

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

హాస్టళ్లు,రెసిడెన్షియల్ స్కూళ్లకు 15 రోజుల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట , అక్షిత బ్యూరో : జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి నవంబర్ నెలలోనే సమస్యలను ..మిగతా 2లో

ప్రతి బిడ్డ జీవితం అమూల్యమైనది

మొదటి పేజీ తరువాయి...



కావడం లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్ల పిల్లలను పెంచలేని పరిస్థితి ఏర్పడినా, దయచేసి బిడ్డను వదిలివేయడం, రహస్య ప్రదేశాల్లో విడిచిపెట్టడం, చెత్తకుప్పల్లో పడేయడం లేదా ఇతరులకు అక్రమంగా అప్పగించడం వంటి చర్యలకు పాల్పడకండి. అని సూచించారు. తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు బిడ్డను పెంచలేని పరిస్థితుల్లో ఉంటే, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖను సంప్రదించండి. శాఖ తరఫున అవసరమైన సహాయం, రక్షణ, సహాయక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బిడ్డను పెంచలేని వారు శాఖను సంప్రదిస్తే, చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా శిశు గృహాలు, ప్రత్యేక దత్తత సంస్థలు ఎస్ ఏ ఏ మరియు సంబంధిత బాలల సంరక్షణ వ్యవస్థల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేస్తాము. బిడ్డకు ఆహారం, వసతి, వైద్యం, విద్య, భద్రతతో పాటు భవిష్యత్తులో చట్టబద్ధమైన దత్తత అవకాశాలను కూడా పరిశీలిస్తాము అని సూచించారు.

అసౌకర్యం కల్గించొద్దు

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి శ్రీనివాస్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని డబల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీకి ఇందిరమ్మ ఇళ్లు -- మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీగా నామకరణం చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం శుక్రవారం జరగనున్న 560 ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు, ముఖ్యంగా ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలనీలో అవసర మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సదుపాయాలను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సమీక్ష సమావేశంలో ఆర్డీఓ ఎన్.రమణారెడ్డి, ఇన్‌చార్జి డీఎస్పీ జి.రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తొద్దు

మొదటి పేజీ తరువాయి...

పరిష్కరించాలని సూచించారు.తాగునీటి సరఫరాతో పాటు నీటి శుద్ధి, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.గ్రామాలు, ఆవాసాల వారీగా తాగునీటి పరిస్థితిని అంచనా వేసి గ్రీన్, ఎల్లో,రెడ్ కేటగిరీలుగా విభజించాలన్నారు.గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.గ్రామాలు,మున్సిపాలిటీల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రత్యేక ప్రొఫార్మా ద్వారా వివరాలు సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్,ఇంట్రా వ్యవస్థల ద్వారా నీటి సరఫరా, స్థానిక నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయాలన్నారు. నీటి సమస్యలు లేని ప్రాంతాలు, కొంత ఇబ్బంది ఉన్న ప్రాంతాలు, తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు.మండలాలు, గ్రామాల వారీగా అవసరమైన పనులు, వాటి అంచనా వ్యయాలతో కూడిన నివేదికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకు 15 రోజుల్లోగా మిషన్ భగీరథ కనెక్షన్లు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కనెక్షన్లు లేని సంస్థలకు ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా కల్పించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో సుమారు 20 నుంచి 25 శాతం వరకు వృథా అవుతున్నట్లు తన పరిశీలనలో గుర్తించానని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ అంచనాపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ పరిస్థితిని వారం రోజుల్లో నివేదించాలని అధికారులను కోరారు.ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి పైపులైన్ల ద్వారా నీరు వృథాగా డ్రైనేజీల్లోకి వెళ్తున్న ప్రాంతాలను గుర్తించి లీకేజీలను అరికట్టాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరాకు ప్రతి గ్రామ పంచాయతీలో ట్రాక్టర్,ట్యాంకర్ అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాల పరిస్థితిపై ప్రతి 15 రోజులకు ఒకసారి నివేదిక ఇవ్వాలని గ్రౌండ్ వాటర్ అధికారులను ఆదేశించారు. నీటి వనరుల లభ్యత, బోర్‌వెల్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు.మిషన్ భగీరథ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, గ్రౌండ్ వాటర్ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.విద్యుత్ సరఫరా అంతరాయాల వల్ల నీటి పంపింగ్ నిలిచిపోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్,డిఆర్డిఓ పిడి సన్యాసయ్య,జడ్పీ సీఈవో శిరీష,డిపిఓ యాదగిరి,మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహా రావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నాణ్యతలో రాజీ పడొద్దు

మొదటి పేజీ తరువాయి...

పనుల ప్రస్తుత పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, సమావేశ మందిరం తదితర విభాగాల్లో కొనసాగుతున్న ఫర్నిచర్ ఏర్పాటు పనులను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఆయా గదుల్లో ఏర్పాటు చేస్తున్న ఫర్నిచర్ నాణ్యత, అమరిక, ఇంటీరియర్ డిజైన్ పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఛాంబర్లు ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా ఉండేలా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫర్నిచర్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న సౌండ్ సిస్టమ్, ఫర్నిచర్ పనులను పరిశీలిస్తూ, సమావేశాలు, ఉన్నతాధికారులతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు ఎలాంటి అంతరాయం కలగకుండా సౌండ్ సిస్టమ్ స్పష్టమైన శబ్ద నాణ్యతతో పనిచేసేలా చూడాలని సూచించారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలు సమర్థవంతం గా వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే అధికారులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. పార్కింగ్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వెంకట రమణయ్యను ఆదేశించారు. కలెక్టరేట్ భవన సముదాయంలో మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను సైతం నిర్లక్ష్యం చేయకుండా గుర్తించి పూర్తి చేయాలని, అన్ని విభాగాల్లో విద్యుత్, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పది రోజుల్లోగా చివరి దశ పనులన్నింటినీ పూర్తి చేసి నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభోత్సవానికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు.ఈ పరిశీలనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్డీఓ వెంకట్ రాములు, కలెక్టరేట్ ఏవో అనిల్ కుమార్, సీపీఓ ఖాఫు వాహన్, ఆర్‌అండ్‌బీ డీఈఈ రాములు, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రైతు మేళా

సీఎం రేవంత్ రెడ్డి రాక

మొదటి పేజీ తరువాయి...



కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొనే కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

రైతు మేళా నిర్వహించే ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేవిధంగా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. వీవీఐపీ, వీఐపీ, అధికారులు, మీడియా, జనరల్ పార్కింగ్ ఏర్పాటుతో పాటు భోజన వసతులకు సంబంధించి వేరువేరుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.

రైతు మేళాకు అధికారికంగా ఇచ్చిన గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.రైతు మేళాకు వచ్చే వారికి సభా స్థలికి సులభంగా చేరుకునే విధంగా రహదారుల వెంబడి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

రైతు మేళా ప్రాంగణంలో త్రాగు నీరు కొరత లేకుండా సమృద్ధిగా ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

రైతు మేళా ప్రాంగణంలో టాయిలెట్లు ఏర్పాటుతో పాటు నవంబర్ 9న జరిగే బహిరంగ సభకు వచ్చే ప్రజలకు అనుగుణంగా పార్కింగ్ ప్రాంతాల్లో టాయిలెట్లు, మంచినీటి సదుపాయాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.

రైతు మేళా సందర్భంగా వ్యవసాయ అనుబంధ శాఖలైన వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలు, పశు సంవర్ధక , మత్స్య శాఖ ల ద్వారా ఏర్పాటు చేసే స్టాళ్ల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ సాగు, రైతులకు అధిక దిగుబడి వచ్చే పంటలపై అవగాహనతో పాటు తగు సూచనలు, సలహాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జడ్పీ సీఈఓ సుధీర్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగింది

ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 'యెన్నం హెల్త్ కిట్స్' పంపిణీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల పట్ల ప్రజల్లో నమ్మకం, ఆసక్తి పెరిగాయని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన మహిళలకు నవజాత శిశువుల సంరక్షణకు అవసరమైన వివిధ వస్తువులతో కూడిన 'యెన్నం



హెల్త్ కిట్స్'ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది నవంబర్ 14వ తేదీన తన సొంత నిధులతో 'యెన్నం హెల్త్ కిట్స్' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు మరింతగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సైతం కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందుబాటులో ఉండాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత విశ్వాసం కల్పిస్తూ, తల్లులు మరియు నవజాత శిశువులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో వి డిఎం ఎస్ విద్యార్థుల ప్రతిభ..

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ విద్యార్థులు



రామన్నపేట అక్షిత ప్రతినిధి: మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు నేమతుల్లా బేగ్, పర్నే ప్రణీత్ రెడ్డి 32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఆక్వా ఫోనిక్స్ గ్రావెల్ బెడ్ ఫార్మింగ్ ప్రాజెక్టును రూపొందించి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్ మాట్లాడుతూ.. విజ్ఞాన శాస్త్రంలో నూతన ఆలోచనలతో వినూత్న ప్రాజెక్టును రూపొందించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ ప్రాజెక్టుకు మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ వెలిమినేటి మల్లేష్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అస్మా, నాగరాజు, స్వామి, ముత్యాలు, సునీత, అనిత, సుధారాణి, శాంతి, సరిత, విద్యాసాగర్ సాయి, వెంకట్ కాంబ్లీ, అనిల్, విజయ, జానకి, గాయత్రి, రాజేశ్వరి, శోభ, ఉమాభారతి, ఉమా, అంజలి, సింధు తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు రూ.30 వేల ఉపకార వేతనాల పంపిణీ

చావలి లక్ష్మీ సుబ్రమణ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: మండలంలోని వెల్లంకి గ్రామంలో పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చావలి లక్ష్మీ సుబ్రమణ్యం ఫౌండేషన్ వారిద్వారా పంపబడిన ఉపకార వేతనాలు 30 వేల రూపాయలు పేద మరియు ప్రతిభగల విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంగెళ్ల సురేందర్ రెడ్డి మరియు తల్లిదండ్రుల సమక్షంలో అందచేయడమైనది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకొని బాగా చదివి అన్ని రంగాల్లో ముందుండాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, క్రమశిక్షణతో కృషి చేస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ ఉపకారవేతనాలు అందించిన చావలి లక్ష్మీ సుబ్రహ్మణ్యం ఫౌండేషన్ వారికి ,ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ సత్తిరెడ్డి ఎం శ్రీనివాస్ రెడ్డి, వై రవికుమార్,ఎస్ సేనారెడ్డి, కే హేమలత కే నర్మదా, డి ఉమామహేశ్వర్, కే స్వప్న, వీ జ్యోతి,టి వసంత లు పాల్గొన్నారు.

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ రంగనాయకమ్మ మృతి..

భౌతికకాయానికి రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్ కాంగ్రెస్ నాయకుల నివాళులు



రామన్నపేట,అక్షిత ప్రతినిధి: భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ రంగనాయకమ్మ గారు మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్, మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్ తదితరులు రంగనాయకమ్మ గారి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, రంగనాయకమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని రంగనాయకమ్మ గారికి నివాళులర్పించారు.

వెన్నచర్ల గ్రామపంచాయతీ సిబ్బందికి సబ్బులు,సర్ఫ్,కొబ్బరి నూనె అందివ్వడం



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ సిపాయి కార్మికులకు గురువారం కొబ్బరినూనె,సబ్బులు,సర్ఫ్ తదితర వస్తువులను గ్రామపంచాయతీ దగ్గర అందివ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి అనేకమైన సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వమని రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ గారి నాయకత్వంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం గ్రామ పంచాయతీ సిపాయి కార్మికులకు అండగా ఉంటూ పలు వస్తువులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరు రాంప్రసాద్ వార్డు మెంబర్స్ వంగూరు స్వామి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కూర రవికుమార్ కారోబార్ భాస్క రాచారి వస్త్రాల వెంకటేష్ బోయ కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

దేహదారుఢ్య,ఆరోగ్య వికాసానికి సైక్లింగ్ క్రీడ అవసరం కన్వీనర్ కన్నెబోయిన నిశాంత్ యాదవ్



వరంగల్, అక్షిత బ్యూరో: ఉమ్మడి వరంగల్ జిల్లా 70వ పాఠశాల క్రీడల్లో భాగంగా సైక్లింగ్ ఎంపిక పోటీలు అండర్ 14 ఇయర్స్ అండర్ 17 ఇయర్స్ బాలపాలికల ఎంపికలు దేశాయిపేట లో నిర్వహించారు.ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా పాఠశాల క్రీడా కార్యదర్శి అనిల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు వరంగల్ జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పుల రాజు, సైక్లింగ్ కన్వీనర్ కన్నబోయిన నిశాంత్ ఫిజికల్ డైరెక్టర్ దేశాయిపేట్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సూరారంలో పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దళారులను నమ్మి మోసపోవద్దు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: మండలంలోని సూరారం గ్రామంలో ఏర్పాటు చేసిన పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని, మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ జంగారెడ్డి, గ్రామ సర్పంచ్ బండిక శ్రీను, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, మార్కెట్ ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

రైతుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

బి ఆర్ ఎస్ నాయకులు జక్కుల వెంకటేష్



వలిగొండ /అక్షిత న్యూస్: జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని టిఆర్ఎస్ నాయకులు జక్కుల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమావేశంలో మాట్లాడుతూ..ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆరుగాలం శ్రమించి,ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ధాన్యాన్ని పండించి కల్లాలకు చేర్చారని తెలిపారు.అరకొర విద్యుత్ సరఫరా కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోయి రైతులు ఇప్పటికే ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. దీనికి తోడు అధికారులు పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు ధాన్యాన్ని విక్రయిస్తూ నష్టపోతున్నారని తెలిపారు.అధికారులు వెంటనే స్పందించి అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కల్లాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరారు. తూకం సమయంలో తాలు పేరుతో అనవసర కోతలు విధించకుండా,నాణ్యతా ప్రమాణాల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. రైతులను నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం,అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పరిశోధనను విమర్శనాత్మక

మూల్యాంకనంతో నిర్ణయిస్తారు..

గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న ఐసర్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిలోస్ కోషి



పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి: ఒక పరిశోధన యొక్క శాస్త్రీయ స్వభావం కేవలం దాని విషయ వస్తువు ద్వారానే కాకుండా, దాని పరిశోధన, పరీక్ష, విమర్శనాత్మక మూల్యాంకనం, జ్ఞానాన్వేషణ పద్ధతుల ద్వారా నిర్ణయిస్తారని ఐఐఎస్ఈఆర్ (ఐసర్) మొహాలీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం, తత్వశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిలోస్ కోషి అన్నారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కు చెందిన అనువర్తిత మనస్తత్వశాస్త్రం (అప్లైడ్ సైకాలజీ) విభాగం 'విజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయంగా మార్చేది ఏమిటి? మారుతున్న పద్ధతులు, వాస్తవికత భావనలు' అనే అంశంపై గురువారం ఆతిథ్య ఉపన్యాసం నిర్వహించింది. తత్వశాస్త్రం, తర్కం, శాస్త్రీయ పరిశోధన, మనస్తత్వ



శాస్త్రంపై ఒక అంతర్ విభాగ దృక్పథాన్ని అందిస్తూ, డాక్టర్ కోషి శాస్త్రీయ తార్కికత యొక్క పునాదులను, శాస్త్రీయ పద్ధతుల యొక్క పరిణామ స్వభావాన్ని అన్వేషించారు. ఆయన పరికల్పనా-అవరోహణ నమూనా, కార్ల్ పాపర్ యొక్క మిథ్యావాద సిద్ధాంతం, డ్యూహెమ్-క్వైన్ సిద్ధాంతం, థామస్ కూన్ యొక్క శాస్త్రీయ మార్పు సిద్ధాంతంతో సహా కీలకమైన తాత్విక చట్రాలను చర్చించారు. ఈ సమావేశం శాస్త్రీయ హేతుబద్ధత, పరికల్పన పరీక్ష, నిర్ధారణ, మిథ్యావాదయోగ్యత, శాస్త్రీయ సిద్ధాంతాలను మూల్యాంకనం చేయడంలో ఎదురయ్యే సవాళ్లపై విలువైన అంతర్దృష్టులను అందించింది. శాస్త్రీయ జ్ఞానం ఎలా అభివృద్ధి చెందుతుంది, వాస్తవికత గురించిన భావనలు ఎలా పరిణామం చెందుతాయి అనే దానిపై విమర్శనాత్మకంగా ఆలోచించమని ఇందులో పాల్గొన్నవారిని ప్రోత్సహించింది. ఈ కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ అధ్యక్షత వహించారు. ఆమె సభికులకు స్వాగతం పలికి, తన ప్రారంభోపన్యాసంతో కార్యక్రమ నేపథ్యాన్ని వివరించారు. తన ముగింపు ప్రసంగంలో, డాక్టర్ కోషి పంచుకున్న లోతైన జ్ఞానాన్ని ఆమె ప్రశంసించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నవ్య వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ సమావేశం, విజ్ఞానశాస్త్ర తత్వశాస్త్రం, ఆచరణపై విభిన్న రంగాల మధ్య సంభాషణను ప్రోత్సహించడానికి, విమర్శనాత్మక దృక్పథాలను బలోపేతం చేయడానికి ఒక అర్థవంతమైన విద్యా వేదికగా ఉపయోగపడింది.

జమ్మూ కాశ్మీర్ నేషనల్ టెన్నికాయిట్ టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారులను అభినందించిన హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



కాజీపేట్ , అక్షిత ప్రతినిధి: తెలంగాణ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన 10వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి, జమ్మూ కాశ్మీర్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేట్ టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ మరియు హనుమకొండ జిల్లా సెక్రెటరీ అల్వాల రాజ్ కుమార్, ఉమ్మడి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ ఎండి జహుర్ ల ఆధ్వర్యంలో ఈ క్రీడాకారులు డిసిసి అధ్యక్షులను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ నెల 17 నుండి 21 వరకు జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించబోయే నేషనల్ లెవెల్ టెన్నికాయిట్ పోటీలలో వీరంతా తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఈ అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైన బాలికల విభాగంలో పరకాల్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాలకు చెందిన జి. నవ్య (5వ స్థానం), చిట్యాల టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాలకు చెందిన బి. జ్యోతి (6వ స్థానం), ఎల్కతుర్తి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాలకు చెందిన పి. ప్రవీణ (7వ స్థానం), హసన్‌పర్తి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టి. అక్షయ (8వ స్థానం) నిలిచారు. అదేవిధంగా బాలుర విభాగంలో నర్సంపేట సైనిక్ స్కూల్ విద్యార్థి ఎమ్. యశ్వంత్ (1వ స్థానం), కరుణాపురం ఎంజేపీ విద్యాలయానికి చెందిన డి. వంశీ కృష్ణ (2వ స్థానం), ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన డి. సాయినాథ్ (3వ స్థానం), కరుణాపురం ఎంజేపీ విద్యాలయానికి చెందిన ఎ. పునీత్ కుమార్ (4వ స్థానం), ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన జి. ఆకాష్ (5వ స్థానం), జకారం సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన జె. శ్రవణ్ (6వ స్థానం) మరియు ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన ఎ. సాంబశివరావు (7వ స్థానం) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటారు.

ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి క్రీడాకారుల మెరిట్ సర్టిఫికెట్లను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు వారి కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే మసీద్ హుస్సేన్

జగిత్యాలలో ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచిత గైడ్స్ పంపిణీ

150 మంది డిగ్రీ విద్యార్థులకు పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సాయం



జగిత్యాల అక్షిత ప్రతినిధి -సపంబర్ 5: విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాంపల్లి ఎమ్మెల్యే మసీద్ హుస్సేన్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సలార్ ఈ మిలాద్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా గైడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగిత్యాల ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

రెండు పడవలపై ప్రయాణం చేసేవారు చివరకు రెండు పడవలనూ ముంచుతారంటూ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనపై పలు విమర్శలు చేశారు.

ఇదిలా ఉండగా, జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థినులు తమకు ప్రభుత్వం నుంచి పుస్తకాలు అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మసీద్ హుస్సేన్ విద్యార్థినులకు అవసరమైన పుస్తకాల కొనుగోలుకు స్వయంగా డబ్బులు చెల్లించారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణానికి చెందిన ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తుల పరిశీలన

అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పిస్తాం

నాగర్ కర్నూల్ జిల్లాలో 38,377 మంది పట్టభద్రుల ఓటర్ల నమోదు

80 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి,

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, అర్హులైన పట్టభద్రుల దరఖాస్తులను నిబంధనల ప్రకారం గడువులోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పురోగతి, దరఖాస్తుల పరిశీలన, అర్హులైన ఓటర్ల నమోదు తదితర అంశాలపై గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అదనపు కలెక్టర్ బి చేన్నయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిని, ఇప్పటివరకు నమోదైన ఓటర్ల వివరాలను, దరఖాస్తుల పరిశీలన స్థితిని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వివరించారు.

నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నాగర్ కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటివరకు మొత్తం 38,377 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. నమోదైన దరఖాస్తుల్లో సుమారు 80 శాతం దరఖాస్తులను పరిశీలించి ఆమోదించడం జరిగిందన్నారు. ఇంకా 1,426 మంది పట్టభద్రుల దరఖాస్తులను పరిశీలించాల్సి ఉందని, వాటిని కూడా నిర్ణీత గడువులోగా పరిశీలించి అర్హతల ఆధారంగా ఓటర్లుగా నమోదు చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని వివరించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదుకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్నవారి దరఖాస్తులను ఆమోదిస్తున్నామని తెలిపారు.

అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రం సమర్పించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కూడా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి జిల్లా కలెక్టర్ తీసుకెళ్లారు, ఈ ఫిర్యాదును పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వివరించారు.

నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలో 12539 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 310 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో 9329 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 128 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో 7041 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 290 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో 9468 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 698 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని అన్నిటిని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.

మొత్తంగా జిల్లాలో 1,426 దరఖాస్తులు పరిశీలనకు పెండింగ్లో ఉన్నాయని, వాటన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జనార్దన్ రెడ్డి కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన తదితరులు అధికారులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు ప్రజ్ఞాభారతి పాటల పోటీలలో ప్రథమ బహుమతి

కరీంనగర్ అక్షిత బ్యూరో: ప్రజ్ఞాభారతి పాటల పోటీలలో పాల్గొనడం అదృష్టంగా భావించాలని మరియు అందులో అవకాశం వచ్చినట్లయితే సామర్థ్యాన్ని ప్రతిభను నిరూపించుకోవాలని మరియు విజయం వైపు అడుగులు వేయాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు ప్రజ్ఞాభారతి పాటల పోటీలలో ప్రథమ బహుమతి రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.

పాటల పోటీలలో పాల్గొనడం ద్వారా ఉల్లాసం కలుగుతుందని మరియు ప్రత్యేక గుర్తింపు వస్తుందని వారు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ్ఞాభారతి వారు అనేక పోటీలను నిర్వహిస్తున్నందని ప్రధానంగా వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నాయని మరియు వారిలో దేశభక్తిని పెంపొందిస్తున్నాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు చెప్పారు.పాడిన పాటలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని మరియు చక్కగా పాడిన వాటికి బహుమతులు వస్తాయని వారు చెప్పారు. ఈ క్రమంలో పాఠశాలకు చెందినటువంటి



ఏ. అభిరామ్,10వ తరగతి. అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఆకర్షించాడని వారు చెప్పారు మరియు ప్రథమ బహుమతిని గెలుచుకున్నాడని చెప్పారు. అదేవిధంగా వి.శ్రీనిధి, పదో తరగతి, ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నదని చెప్పారు పాటల పోటీలలో పాల్గొనడం ద్వారా ఉల్లాసం కలుగుతుందని మరియు ప్రత్యేక గుర్తింపు వస్తుందని వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ్ఞాభారతి వారు అనేక పోటీలను నిర్వహిస్తున్నందని మరియు దేశం పట్ల స్ఫూర్తిని పెంపొందిస్తున్నదని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు చెప్పారు. ప్రధానంగా వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నాయని మరియు వారిలో దేశభక్తిని పెంపొందిస్తున్నాయని చెప్పారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ్ఞాభారతి వారు అనేక పోటీలను నిర్వహిస్తున్నందని ప్రధానంగా వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నాయని మరియు వారిలో దేశభక్తిని పెంపొందిస్తున్నాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు చెప్పారు. ప్రధానంగా విషయ పరిజ్ఞానం పెరుగుతుందని మరియు పాటల ద్వారా గుర్తింపు పొందగలుగుతామని మరియు వివిధ సందర్భాలలో నిర్వహించేటువంటి పోటీలో పాల్గొనేందుకు ఆస్కారం ఉంటుందని వారు చెప్పారు. పాడిన పాటలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని బహుమతులు వస్తాయని వారు చెప్పారు.

విజేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

హుస్సేన్ నాయక్‌కు ఘన స్వాగతం

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్,అక్షిత బ్యూరో: జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను గురువారం వరంగల్‌లోని హరిత కాకతీయ హోటల్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులకు జిల్లా కలెక్టర్ పూల మొక్కను అందించి సాదరంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారి వెంట ఆర్డీవో సుమ,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలి

తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్

సిరిచెల్మ డీఆర్ డీ తనిఖీ



ఇచ్చోడ అక్షిత న్యూస్: రేషన్ డీలర్లు, డీఆర్ డీపో సేల్స్ మెన్లు సమయ పాలన పాటిస్తూ లబ్ధిదారులకు సకాలంలో నిత్యావసర సరకుల్ని పంపిణీ చేయాలని ఇచ్చోడ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ అన్నారు. గురువా రం మండలంలోని సిరి చెల్మ డీఆర్ డీ తనిఖీ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఆర్ డీపో కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వర కు, సాయంత్ర 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. ఆదివారం సెలవు దినమని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాలను, డీఆర్ డీపోలను నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న నిత్యావసర సరకుల్ని తీసుకెళ్లేందుకు వచ్చే వారి పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడకూడాదని పేర్కొన్నారు. సమయ పాలన పాటించని సంబధిత డీలర్లు, సేల్స్ మెన్లు పై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

రామన్నపేట పట్టణంలో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య నివారణకు చర్యలు



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రామన్నపేట పట్టణంలో రెండు చోట్ల 5 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన రెండు మోటార్లను ఏర్పాటు చేశారు. పద్మశాలి కాలనీలో సంగిశెట్టి శేఖర్ ఇంటి సమీపంలో, జనంపల్లి రోడ్డులోని ఎల్లమ్మ గుడి వద్ద ఈ మోటార్లను అమర్చారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు గ్రామపంచాయతీ పాలకవర్గం తెలిపింది. నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటె రమేష్, పంచాయతీ కార్యదర్శి వంగాల సైది రెడ్డి, వార్డు సభ్యులు జూడ సంతోష్, సూర్వి హరిబాబు, కొమ్ము శేఖర్, మోటె మహేష్, బండ కవిత లింగస్వామి, అంజద్, నోముల అనిత యాదయ్య, నకిరేకంటి పార్వతమ్మ సుదర్శన్, గొరిగే పారిజాత శేఖర్, కొమ్ము రామస్వామి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జన్మదినం సందర్భంగా వికలాంగుల ఆశ్రమానికి ఆర్థిక సహాయం



కోడాడ, నవంబర్ 05,(అక్షిత న్యూస్): శనగల రాధాకృష్ణ వికలాంగుల ఆశ్రమంలో కర్ణం ఐరా జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వారి తల్లిదండ్రులు మనీషా, వరుణ్ సేవాభావాన్ని చాటు కున్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థుల భోజన ఖర్చుల నిమిత్తం రూ.3,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తమ బిడ్డ జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేదలకు, వికలాంగులకు భోజన సదుపాయం కల్పించేలా సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కర్ణం ఐరా తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేను నాటిన మొక్కలు చూడటానికి వచ్చా!

మొక్కలను చూసి మురిసిపోయిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటపుల్లయ్య.



సత్తుపల్లి, అక్షిత న్యూస్: మొక్కలను నాటడమే కాదు, వాటిని పెంచి పెద్దవిగా చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని నిరూపిస్తున్నారు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య. 2020 నుంచి 2024 వరకు సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వృక్షో రక్షతి రక్షితః (వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి) అనే నినాదంతో హరిత దీక్ష చేపట్టిన ఆయనకు మొక్కలంటే ఎంతో ప్రేమ.

సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా అక్కడ మొక్కలు నాటడమే తన బాధ్యతగా భావించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కోర్టు, పోలీస్ స్టేషన్లు ఇలా అనేక ప్రాంగణాల్లో రకాల మొక్కలు నాటారు.

తన కార్యాలయానికి వచ్చే ప్రజలకు మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించడమే కాకుండా, వారికి స్వయంగా మొక్కలను అందించి వాటిని పెంచాలని ప్రోత్సహించేవారు. ఈ విధంగా సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, వేంసూర్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేశారు.

ప్రస్తుతం భద్రాద్రి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ సత్తుపల్లిలో తాను నాటిన మొక్కలపై ఆయనకు ఉన్న మమకారం మాత్రం తగ్గలేదు.

గురువారం సత్తుపల్లికి వచ్చిన ఆయన, గతంలో తాను మొక్కలు నాటిన పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వాటి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు

కొన్ని మొక్కలు ఎండిపోయి కనిపించగా బాధపడ్డారు. మరికొన్ని వృక్షాలుగా ఎదగడం చూసి ఆనందం వ్యక్తం చేశారు. తాను నాటిన మొక్కలను ఆప్యాయంగా స్పృసించారు. సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు ఈ సందర్భంగా ఆయన సేవలను అభినందిస్తూ శాలువా, పుస్పగుచంతో అభినందించారు.

మానేరు కన్నీరు

మానేరు వాగుకు ఇసుక మాఫియా గండి!

టేకుమట్లలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు..

వందలాది ట్రాక్టర్లలో తరలింపు!

కోటంచ ఆలయం పేరు అడ్డుపెట్టుకుని అక్రమ దందా?

అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు..అధికారుల తీరుపై అనుమానాలు

భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతుల ఆవేదన

చోద్యం చూస్తున్న రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు!

అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికార యంత్రాంగం కళ్లముందే మానేరు వాగు ఇసుక అక్రమార్కుల పాలవుతోందా? ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? లేవా? అనే కనీస పర్యవేక్షణ లేకుండానే జయ శంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో ఇసుక తవ్వకాలు, రవాణా సాగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి..

కలికోటపల్లి గ్రామ శివారు మానేరు వాగు నుంచి వందలాది ట్రాక్టర్లలో ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు. కోటంచ ఆలయం పేరు చెప్పి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలకు ఇసుకాసురులు తెరలేపారు.. వందలాది ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.. ఈ ఇసుకునంత ఒక చోట డంప్ చేసి అక్కడి నుండి హనుమకొండ హైదరాబాద్ నగరాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..ఈ విషయాన్ని గమనించిన బీఆర్ఎస్ నాయకులు గురువారం కలి కోటపల్లి శివారులోని మానేరు వాగులో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు.. దీంతో అక్రమ ఇసుక రవాణా అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది..

ఎలాంటి పర్మిషన్లు లేవు,ఎవరు ఆపరు

అధికార పార్టీ నాయకుల కనసన్నల్లోనే అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని బిఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. అధికారులను అడ్డం పెట్టుకొని మరి ఇసుకను తోడేస్తున్నారన్నారు..ఎలాంటి పర్మిషన్ లేకుండానే యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు..మానేరు వాగులో భారీగా ఇసుకను తోడటం తో భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లు, బావులు ఎండిపోయే ప్రమాదం ఉందని, దీనివల్ల అన్నదాతలు నష్టపోతారన్నారు. ఇప్పటికే వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఈ తవ్వకాలు శాపంగా మారనున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు..

అధికారుల మౌనం వెనుక మతలబేంటి?

ఇసుక అక్రమ రవాణాకు అధికారుల సహకారం ఉందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. అధికార పార్టీ అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతోందని విమర్శిస్తున్నారు. వాగులో ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ , పోలీస్ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అసలు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎంత మేరకు అనుమతించారు? అనుమతించిన దానికంటే ఎక్కువగా తవ్వుతున్నారా? రోజుకు ఎన్ని ట్రాక్టర్ల ఇసుక తరలిస్తున్నారు? ఈ దందా వెనుక ఉన్న అసలు వ్యక్తులెవరు? పోలీసులకు, సంబంధిత అధికారులకు ఈ వ్యవహారం తెలియదా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మానేరు వాగులో జరుగుతున్న తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.







గౌతంపల్లిలో భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్రంగా నమోదు చేయాలి,

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండలం గౌతంపల్లి గ్రామంలో కొనసాగుతున్న నీటిపారుదల కాల్వలకు సంబంధించిన భూ రీ సర్వే ప్రక్రియను గురువారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

గ్రామంలో భూ రీ సర్వే పనుల పురోగతి, భూముల వివరాల నమోదు, రైతులకు సంబంధించిన భూ రికార్డుల స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ సర్వే ప్రక్రియలో భాగంగా రైతుల భూములతో పాటు ప్రభుత్వ భూములు, రైతుల నుంచి స్వీకరించిన నీటిపారుదల భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటూ, సర్వే ప్రక్రియ ఏ మేరకు పూర్తయింది, ఇంకా ఎన్ని భూముల వివరాలను నమోదు చేయాల్సి ఉంది అనే అంశాలపై ఆరా తీశారు. రైతులకు సంబంధించిన భూముల విస్తీర్ణం, భూముల సరిహద్దులు, భూ రికార్డుల్లో



నమోదైన వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న భూముల పరిస్థితిని పరిశీలించారు. భూ రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వాస్తవ వివరాలను గుర్తించి, రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు.

రైతుల భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో నమోదైన విస్తీర్ణం, సర్వేలో గుర్తించిన భూముల వివరాలను సమన్వయం చేసుకోవాలని, గ్రామంలో రైతులకు సంబంధించిన భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ యాజమాన్యానికి సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు.

భూ రీ సర్వే సమయంలో రైతులకు సంబంధించిన వివరాలు స్పష్టంగా ఉండేలా చూడాలని, భూముల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలపై రైతులకు ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే వాటిని పరిశీలించి, సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను రైతుల భూముల వివరాలతో సమన్వయం చేసుకుంటూ సర్వే నిర్వహించాలని, భూముల వర్గీకరణలో స్పష్టత ఉండేలా చూడాలని తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు సక్రమంగా నమోదు కావడం ద్వారా భవిష్యత్తులో భూములకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు.

రైతుల భూములకు సంబంధించిన వివరాలను నమోదు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. భూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, భూములకు సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేయడం ద్వారా భూ రికార్డుల నిర్వహణలో స్పష్టత, కచ్చితత్వం సాధించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.కలెక్టర్ వెంట తాసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం...

రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్.. మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు

రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలి

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్...



లోకేశ్వరం,నవంబర్ 5 అక్షిత న్యూస్ : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ముధోల్ మండలం వడ్తాల, లోకేశ్వరం మండలం కనకాపూర్, అబ్దుల్లాపూర్, ధర్మోరా, పంచగుడి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.



మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు బోనస్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, బి-గ్రేడ్ రకానికి రూ.2,441 చెల్లించనున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ అందించనున్నట్లు వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు.

వర్షాభావ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలి

ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతు భరోసా నిధులను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభం సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు కరిపే రమేష్, సునీల్, భోజన్న, సంజీవ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సాగౌడ్, ముధోల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కిష్టయ్య, లోకేశ్వరం మండల నాయకులు, మాజీ సర్పంచ్ శ్రీధర్, సీనియర్ నాయకులు బద్దం గంగారెడ్డి, బీజేపీ లోకేశ్వరం మండల అధ్యక్షుడు సాయన్న, సంటెన్న, జయసాగర్ రావు, మంద భాస్కర్, వెంకట్ రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాల పరిశీలన

వడ్తాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం, మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరామర్శ

కనకాపూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ చిన్న గంగాధర్, దెబ్బడి పోశెట్టి నివాసాలకు ఎమ్మెల్యే వెళ్లి వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు...

పట్టణ పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులే వెన్నుముక

చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర నాయక్



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: పట్టణ పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులే వెన్నెముకని చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. గురువారం చౌటుప్పల్ పురపాలక సంఘం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, దుస్తులు, గ్లౌజులు, మాస్కులు, సబ్బులు, కొబ్బరి నూనె, బెల్లం, టవల్స్, షూస్, పీపీఈ కిట్లు తదితర నిత్యావసర వస్తువులను చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ యన్ వెంకటేశ్వర నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ...పట్టణం బాగుండాలంటే ముందుగా పారిశుద్ధ్య కార్మికులు బాగుండాలన్నారు. పట్టణ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు.వారి సంక్షేమం, ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వపరంగా అందాల్సిన అన్ని వసతులను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.పారిశుద్ధ్య కార్మికులందరినీ నా కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ...పారిశుద్ధ్య కార్మికులు లేనిదే పట్టణం లేదని,పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడంలో కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు.విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.పట్టణ పరిశుభ్రతకు అంకితభావంతో పనిచేయాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు గడ్డం ఇందిరా రాజరత్నం, పిల్లలమర్రి మధుసూదన్, కో-ఆప్షన్ సభ్యులు పస్తం గంగారామ్, నాయకులు పల్లె సురేందర్ రెడ్డి, ఉడుగు రమేష్, బత్తుల దాసు, దేప రాజు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్లు నరసింహ, అంజయ్య, పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు సాయి గ్రామర్ స్కూల్‌లో దామోదర దీపోత్సవం



చిలుకూరు,నవంబర్ 5,(అక్షిత న్యూస్): పవిత్ర దామోదర మాసం సందర్భంగా స్థానిక చిలుకూరు సాయి గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులు ఇస్కాన్ సంస్థ సభ్యురాలు బోనగిరి హైమ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో దామోదర దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ దామోదరుడి (శ్రీకృష్ణుడు) చిత్రపటం ఎదుట విద్యార్థులందరూ నేతి దీపాలు వెలిగించి, దామోదర అష్టకం పఠిస్తూ భక్తితో హారతులు సమర్పించారు.

ఈ సందర్భంగా పాఠశాల /ప్రిన్సిపాల్ గవిని ఆంజనేయులుమాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల పట్ల విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దామోదర మాసంలో దీపదానం చేయడం వల్ల జీవితంలో అజ్ఞానం తొలగి, సద్బుద్ధి, విజ్ఞానం లభిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లు దీప్తి, ఉమా, అనూష, అరుణ, ఇందిరా, ఇందు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ

ఆర్ఎస్ఈటీఐ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలి

నైపుణ్యాభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా...



నిర్మల్, అక్షిత ప్రతినిధి, నవంబర్ 5 : గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్ఎస్ఈటీఐ) ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

గురువారం దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. ఆర్ఎస్ఈటీఐ ఏర్పాటుకు అనువైన భవన సదుపాయాలు, ఖాళీ స్థలాలు, శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించి, వివరాలు తెలుసుకున్నారు.

స్వయం ఉపాధే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ

ఈ సందర్భంగా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి స్వయం ఉపాధి మార్గాలను చూపడమే ఆర్ఎస్ఈటీఐ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని సొంతంగా ఉపాధి పొందేలా నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కేంద్రానికి వచ్చే యువతకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు యువత ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి శిక్షణ కేంద్రాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, మహిళా శిశు వికాస కేంద్ర మేనేజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు...

బేతుపల్లి మత్స్యకారులను ఆదుకోవాలి

సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్



సత్తుపల్లి, అక్షిత న్యూస్: బేతుపల్లి చేపల సొసైటీ మత్స్యకారులకు అవసరమైన చేపపిల్లలను,కొత్తబోట్లు,వలలను ప్రభుత్వం సమకూర్చాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కూకలకుంట రవి, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు గంటాశ్రీనివాసరావు, అమర్లపూడి శరత్, తాటి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదల్లో చిక్కుకొని ప్రస్తుతం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బేతుపల్లి చేపల సొసైటీ మత్స్యకారులను గురువారం పౌర హక్కుల సంఘం, మాస్ లైన్ పార్టీ నాయకుల బృందం గురువారం పరామర్శించారు.ఈసందర్భంగా వారు మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మురసు తుఫాను మూలంగా వచ్చిన వరదలకు బేతుపల్లి చెరువులోని చేపలుమొత్తంకొట్టుకుపోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాస్ లైన్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి రూ.50 వేలు ఆర్థిక సహాయం అంద చేయాలని కోరారు. మత్స్య శాఖ తరపున 20 టన్నుల చేప పిల్లలను తక్షణం పంపిణీ చేయాలన్నారు. సొసైటీలోని సభ్యులందరికి అవసరమైన కొత్తవలలు,మూడు బోట్లు సమకూర్చాలని కోరారు. ఈ చెరువుపై నాలుగుగ్రామాలకు చెందిన మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.

ఈనెల 7న జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలి

బొలుగుల నరసింహ



వలిగొండ/ అక్షిత న్యూస్: తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఈనెల 7వ తేదీన వలిగొండ మండలం కేంద్రం నుండి వెళుతున్న సందర్భంగా మండలంలోని బీసీలు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు బొలుగుల నరసింహ కోరారు. గురువారం మండల కేంద్రంలో పాదయాత్ర కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా పోరాడి రాజ్యాధికార దిశగా సాగాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీలను అణగదొక్కుతూ కొద్దిమంది ఉన్నత వర్గం వారు రాజ్యాలనేలుతూ బీసీలను ఓటు బ్యాంకు గానే చూస్తూ అవమాన పరుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా ఏకతాటిపై నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బిసి రాజ్యాధికారం కోసం ముందుకు రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గొలుసుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ రమేష్, వలిగొండ టిప్పర్ అసోసియేషన్ నాయకులు గండికోట శ్రీశైలం, పల్లపు శ్రీశైలం, గండికోట రాజశేఖర్, గండికోట రాజు, ఓర్సు కనకసారయ్య, దుంప శ్రీను, ఓర్సు చందు, దండ్ల వెంకటేశం, దుంప రమేష్, పీట్ల ఐలేష్, దుంప సారయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్గేష్‌పూర్ హనుమాన్ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి


నూతన చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు..

ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొని లబ్ధి దారులకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే..



తాండూరు వర్షిత ప్రతినిధి: తాండూరు నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం తాండూరు మండలం చెన్గేష్‌పూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ దేవాలయ నూతన చైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో



నూతన చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయ నూతన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, ఆకాంక్షించారు.

దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో కమిటీ సభ్యుల పాత్ర కీలకమని, పేర్కొంటూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన కమిటీ కృషి చేయాలని, సూచించారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్య క్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, ఆకాంక్షించారు.

అనంతరం గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. నూతన గృహాల్లోకి ప్రవేశిస్తున్న లబ్ధి దారులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబాలతో ఆనందాన్ని పంచుకున్నారు.

ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రతను, ఆత్మగౌరవాన్ని అందిస్తుందని, నూతన గృహాల్లోకి అడుగు పెడుతున్న లబ్ధిదారుల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాలతో చెన్గేష్‌పూర్ గ్రామంలో ఆధ్యాత్మిక, సామాజిక వాతావరణం నెలకొంది. నూతన ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొనడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ మున్నూరు కాపు సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ఖమ్మం /అక్షిత బ్యూరో : తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం సన్నాహక సమావేశం ఖమ్మం మున్నూరు కాపు హాస్టల్ నందు నగర అధ్యక్షులు రాపర్తి శరత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా శెట్టి రంగారావు, గోవింద్ శ్రీనివాసరావు, కోశాధికారిగా మాదంశెట్టి హనుమంతరావును ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు మేకల బిక్షమయ్య మూలగొండ్ల శ్రీహరి ట్రస్టు బోర్డు చైర్మన్ కనకం జనార్దన్ రావు కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య రాష్ట్ర నాయకులు కట్ల రంగారావు భద్రాద్రి కొత్తగూడెం గ్రంధాలయం అధ్యక్షులు పసుపులేటి వీరబాబు ఏ ఎం సీ చైర్మన్ బండారు నరసింహారావు సూరంశెట్టి కిషోర్ గాదె లక్ష్మీనారాయణ పెద్దబోయిన శ్రీనివాసరావు ఉంగరాల సుధాకర్ చెరుకూరి పూర్ణ ఎర్రి నరసింహారావు కటిక కిరణ్ తోట రామారావు దుగ్గిదేవర నాగేశ్వరరావు సముద్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ముఖ్య అతిథి కనకం జనార్దనరావు మాట్లాడతూ ప్రస్తుత పరిస్థితి లలో ఖమ్మం జిల్లా కాపు సంఘం ఐక్యతకు మీరు మేము కలిసి కృషి చేయుటకు తగు సలహా సూచనలు ఇచ్చినారు. రానున్న కాలంలో సంఘ సభ్యులు ప్రతి ఒక్కరు వారు ఏ కమిటీలలో ఉన్నా సంఘ సభ్యత్వం చేసి ట్రస్టు బోర్డు ద్వార ఎన్నిక జరగాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు శెట్టి రంగారావు మాట్లాడుతూ ప్రతి గ్రామం ప్రతి మండలం నందు మున్నూరు కాపు కుల బంధువులను కలుపుకొని సంఘం సభ్యత్వంలు చేర్పించి విస్తృతంగా మన సంఘ సభ్యత్వమును బలోపేతం చేసుకోవాలని అందుకు కుల బంధువులందరూ సహకరించాలని కోరారు. ఒక్క రోజు టైంలోనే నేటి సన్నాహక సమావేశంకు ఇంతమంది కుల బంధువులు రావడం చాలా ఆనందంగా ఉన్నదని వారందరికీ ధన్యవాదాలు తెలియచేశారు. రానున్న కాలంలో పేద విద్యార్థులకు పేద కుటుంబాలకు అండగా ఉంటుందని రాజకీయాలకు అతీతంగా ఈ కమిటీ మున్నూరు కాపుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందని ఖమ్మం నగరమే కాకుండా జిల్లా మొత్తం తిరిగి మిగతా కమిటీలు పూర్తి చేసుకుంటామని పాత తరం కుల పెద్దలు కీర్తి శేషులు మలిశెట్టి వరదయ్య, కనకం సత్యం మేకల సంగయ్య బొమ్మిశెట్టి నారాయణ రాపర్తి రంగారావు నిమ్మల శంకరరావు ఆశయ సాధనలో అడుగులు వేస్తూ ఈ కమిటీ ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బైరిశెట్టి శ్రీనివాసరావు గంగశెట్టి శ్రీనివాస్ పెళ్లూరు విజయ్ కుమార్ సి హెచ్ విప్లవ కుమార్ పసుపులేటి ఉపేందర్ వెంకట్ నాయుడు వెన్న పండు నితిన్ పసుపులేటి నాగరాజు వాసంశెట్టి సాయికృష్ణ చెరుకూరి ఉష బాసెట్టి శ్రావ్య నిమ్మల సుకన్య తదితరులు పాల్గొన్నారు.నూతన కమిటీ సభ్యులను పరిచయం చేసి వారికి శాలువాలు కప్పి సన్మానం చేయడం జరిగింది.

బేతుపల్లి రెస్క్యూటీంను ప్రశంసించిన మంత్రులు తుమ్మల,పొంగులేటి

16 మందిని సురక్షితంగా కాపాడిన ఎన్డీఆర్ ఎఫ్,ఎస్డీఆర్ ఎఫ్,ఫైర్ సిబ్బందికి అభినందనలు



సత్తుపల్లి, అక్షిత న్యూస్: సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో చోటుచేసుకున్న ప్రమాద ఘటనలో ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపట్టి 16 మందిని సురక్షితంగా కాపాడిన ఎన్ డి ఆర్ ఎఫ్,ఎస్ డి ఆర్ ఎఫ్, ఫైర్ సిబ్బందిని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి దయానంద్‌తో కలిసి మంత్రులు చెరువు ప్రాంతాన్ని వేర్వేరుగా సందర్శించి, సహాయక చర్యల వివరాలనుఅడిగితెలుసుకున్నారు.ప్రమాద సమయంలో రాత్రంతా నీటిలో ఉండి, ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా బాధితులను రక్షించేందుకు రెస్క్యూ సిబ్బంది చూపిన సాహసం, అంకితభావం, సమయస్ఫూర్తిని మంత్రులు ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విపత్తు సహాయక బృందాలను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

ఎమ్మెల్యే చొరవ, కలెక్టర్ పర్యవేక్షణకు ప్రత్యేక ప్రశంసలు

ప్రమాదం జరిగినప్పటి నుంచి సహాయక చర్యలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి నిమిషానికోసారి పరిస్థితులను సమీక్షిస్తూ,అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, సహాయక చర్యలను సమన్వయం చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌ను మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

అదేవిధంగా జిల్లా కలెక్టర్ దివాకర్ రాత్రంతా అక్కడే ఉండి సహాయకచర్యలనుపర్యవేక్షిస్తూ, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసిన తీరును మంత్రులు ప్రశంసించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ, సమన్వయం సహాయక చర్యల్లో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు.

మహిళా ఎమ్మెల్యే అయినప్పటికీ ప్రమాద సమయంలో ఎలాంటి వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ముందుండి సహాయక చర్యలను పర్యవేక్షించిన డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చొరవపై నియోజకవర్గ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నాయకురాలు తమకు ఉండటం ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని వారు పేర్కొన్నారు.ప్రాణాలను కాపాడేందుకు ప్రాణాలకు తెగించి పనిచేసిన రెస్క్యూ యోధులసేవలుఅభినందనీయం. వారి సాహసం, అంకితభావం సమాజానికి స్ఫూర్తిదాయకం.